క్లుప్తంగా

458 పశువులకు వైద్యసేవలు


పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట: రావికంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఏలూరు సేవా సంస్థ ఆధ్వర్యంలో గోద్రెజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ సహకారంతో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ఇందిరా 458 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ పశువులు మంచి పాల దిగుబడిని ఇవ్వాలన్నా, చూడు కట్టాలన్న, నిలబడాలన్న కాలుష్యం, మినరల్ మిక్సర్ తగిన మోతాదులో కుడితిలో కలిపి ప్రతిరోజు పెట్టాలన్నారు. పశువులకు ఇలా అందించడం వలన నీరసం తగ్గి, బలంగా ఉండి మంచి పాల దిగుబడిని ఇస్తాయని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కనుమూరు అంజిరెడ్డి, సేవా సంస్థ సభ్యులు రాజారావు, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత


బాధితుడికి బియ్యం, నిత్యవసర సరుకులు అందజేస్తున్న స్కౌట్, గైడ్స్ విద్యార్థులు

కామవరపుకోట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి చికిత్స చేయించుకున్న రావికంపాడు గ్రామానికి చెందిన ఏలేటి జానుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్, గైడ్స్ విద్యార్థులు గురువారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్కౌట్ గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో సేవాభావం కలిగి ఉండడం అభినందనీయమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ అంజిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోండి


రేచర్ల సచివాలయంలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని రేచర్ల సచివాలయంలో గురువారం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య వచ్చినా భయపడాల్సిన అవసరం ఉండదన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా నిరుపేదల ఆరోగ్యం పట్ల ఇంతగా శ్రద్ధ తీసుకోలేదని అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్న రాట్నాలు, ఎంఈఓ కిరణ్‌బాబు, సర్పంచ్ కె శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దయ్య

బుట్టాయగూడెం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రచారం నిర్వహించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో గురువారం ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో చేర్పులు మార్పులు ఉంటే వారి అభిప్రాయాలను తెలియపరచాలని అన్నారు. అలాగే కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు వారి వివరాలను నమోదు చేసుకోవాలని వివరించారు. ఎన్నికలు జరిగే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరాతో భరోసా


ఆసరా కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి
- పోలవరంలో ఆసరా నమూనా చెక్‌ల పంపిణీ

బుట్టాయగూడెం(పోలవరం): సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం పోలవరంలో నిర్వహించిన ఆసరా చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇచ్చిన మాట నెరవేర్చే నైజం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సొంతమని అన్నారు. జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమైన పదవులను మహిళలకే కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనను ఎంపిక చేయడంపై జగనన్నకు రుణపడి ఉంటానని ఆమె చెప్పారు. తన భర్త ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతానని తెలియజేశారు. కాగా పోలవరం మండలంలో 1220 మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా ద్వారా నాల్గో విడతలో మంజూరైన రూ.7 కోట్ల 32 లక్షల నమూనా చెక్‌ను రాజ్యలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరామరాజు, ఎంపీపీ, జిల్లా ఎంపీపీల ఛాంబర్ అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పి.పుష్ప, ఎంపీడీఓ జి.శ్రీను, ఏపీఎం బి.శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

స్వామీ.. ఏమిటీ దుస్థితి!

- ఉచిత ప్రసాదం పంపిణీ ప్రాంతంలో కుళాయిలకు డమ్మీలు
- చేతులు కడుక్కునేందుకు నీరు దొరక్క భక్తుల ఇక్కట్లు
- ఆలయ అధికారుల తీరుపై మండిపడుతున్న భక్తులు


డమ్మీలు వేయడంతో మూతపడ్డ కుళాయిలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఉచిత ప్రసాదం పంపిణీ జరిగే ప్రాంతంలో నీటి కుళాయిలకు డమ్మీలు వేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రసాదం తిన్న తరువాత చేతులు కడుక్కునేందుకు నీరు దొరక్క అష్టకష్టాలు పడుతున్నారు. స్వామీ.. ఏమిటీ దుస్థితి అంటూ ఆలయ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. వివరాల్లోకి వెళితే. నిత్యం చినవెంకన్నను 5 నుంచి 10 వేల మంది, శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో సుమారు 25 నుంచి 35 వేల మంది భక్తులు దర్శిస్తుంటారు. దర్శనానంతరం క్యూలైన్ గుండా బయటకు వచ్చే భక్తులకు దేవస్థానం ఉచిత ప్రసాదాన్ని అందిస్తోంది. ప్రసాదం తిన్న భక్తులు ఆ ప్రాంతంలో ఉన్న మంచినీటి కుళాయిల వద్ద చేతులు కడుక్కుని, నీటిని తాగేవారు. అయితే ఇటీవల ఆలయ అధికారులు ఆ మంచినీటి కుళాయిలకు డమ్మీలు వేశారు. అప్పటి నుంచి భక్తులకు నీటి కష్టాలు మొదలయ్యాయి.

నీటి బొట్లు కోసం నిరీక్షణ

ప్రసాదం తిన్న తరువాత భక్తులు కుళాయిల వద్దకు చేరుకోవడం వల్ల అక్కడ రద్దీ ఏర్పడి ఇబ్బందులు కలుగుతున్నాయన్న సాకుతో అధికారులు నీటి కుళాయిలకు డమ్మీలు వేశారు. ఈ అనాలోచిత నిర్ణయం కారణంగా చుక్క నీటి కోసం భక్తులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ప్రసాదం తిన్న తరువాత చేతులు ఎక్కడ కడుక్కోవాలో తెలియక దిక్కులు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే డమ్మీలు వేసిన కుళాయిల పక్క నుంచి ఒక ట్యూబ్ ద్వారా వస్తున్న లీకేజీ నీటి బొట్లతో భక్తులు చేతులు కడుక్కుంటున్నారు. ఆ నీటి బొట్లు కోసం భక్తులు ఆ ప్రాంతంలో ఎగబడుతున్నారు. అసలు డమ్మీలు వేయడం వల్లే కుళాయిల వద్ద భక్తుల రద్దీ ఏర్పడుతుంది.


ట్యూబ్ నుంచి వస్తున్న నీటిబొట్లతో చేతులు శుభ్రం చేసుకునేందుకు భక్తుల పోటీ


వెంట తెచ్చుకున్న మినరల్ వాటర్‌తో డస్ట్‌బిన్‌లో చేతులు శుభ్రం చేసుకుంటున్న భక్తులు

చేతులు శుభ్రం చేసుకోకుండానే..

కొందరు భక్తులు చాలీచాలని నీటి బొట్ల కోసం వేచి చూడలేక చేతులు కడక్కుండానే తూర్పు రాజగోపురం గుండా బయటకు వెళ్లి, అక్కడ కుళాయి వద్ద చేతులు కడుక్కుంటున్నారు. అయితే బయటకు వెళ్లే క్రమంలో భక్తుల చేతికి ఉన్న ప్రసాదం రెయిలింగ్‌కు, గోడలకు అంటుకుంటోంది. దాంతో వెనుక వచ్చే భక్తులకు ఆ ఎంగిలి ప్రసాదం అంటుకోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ క్షేత్రంలో ఇలాంటి పరిస్థితులు ఎదురవడం దురదృష్టకరమని భక్తులు వాపోతున్నారు. దీనిపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావును వివరణకోరగా పరిశీలించి, చర్యలు చేపడతామన్నారు.

ఇంత దారుణమా..



ప్రసాదం తిన్న తరువాత చేతులు కడుక్కోవడానికి కనీసం నీరు లేకపోవడం చాలా దారుణం. ఎంగిలి చేతులతో ఎలా బయటకు వెళ్లేది. ఈ మాత్రం ఆలయ అధికారులకు తెలియకపోవడం బాధాకరం. కుళాయిలకు డమ్మీలు వేసిన ప్రాంతంలో ట్యూబ్ ద్వారా వస్తున్న నీటి బొట్లతో చేతులు కడుక్కోవాల్సి వచ్చింది.

వెంకటరత్నం, భక్తురాలు, విజయవాడ

భక్తుల ఇబ్బందులు కనబడట్లేదా..



ఉచిత ప్రసాదం తిన్న తర్వాత చేతులు కడుక్కోవడానికి, తాగడానికి నీరు దొరక్క మేము ఎన్ని ఇబ్బందులు పడుతున్నామో అధికారులకు కనబడటం లేదా. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న అధికారులు దీనికి ఏం సమాధానం చెబుతారు. నీటి బొట్ల కోసం ఆలయంలో పోటీ పడాలా. ఇది చాలా దారుణం.

శ్రీవెంకటేశ్వర, భక్తుడు, భీమవరం

హోరాహోరీగా గిరిజన క్రీడోత్సవ పోటీలు


నాటుబాణం పోటీలో తలపడుతున్న గిరిజన పెద్దలు


కబడ్డీలో హోరాహోరీగా..


వాలీబాల్‌లో పైచేయి ఎవరిదో..

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం జూనియర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో గిరిజన క్రీడోత్సవ పోటీలు గురువారం రెండోరోజు హోరాహోరీగా జరిగాయి. ఈ క్రీడోత్సవంలో వాలీబాల్, విలువిద్య, కబడ్డీ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అత్యధికంగా టీమ్‌లు పాల్గొనగా రెండు బ్యాచ్‌లుగా ఈ పోటీలను జరిపారు. బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, మండలాల నుంచి అత్యధికంగా క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే విలువిద్య పోటీల్లో యువకులతోపాటు పెద్దలు సైతం పోటీపడ్డారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చిన పెద్దవారు నాటు బాణాలతో పోటీలో తలపడ్డారు. కబడ్డీ క్రీడాకారులు కూడా అత్యధింగా పాల్గొన్నారు. ఎంతో ఆసక్తిగా జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి

ద్వారకాతిరుమల: కొత్త వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులను గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవాలని, నిర్దేశించిన ఎస్టిమేట్ చార్జీలు తప్ప ఇతరులకు ఏవిధమైన సొమ్ములు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని ఏలూరు విద్యుత్ శాఖ ఈఈ నటరాజన్ సూచించారు. మండలంలోని ఐఎస్ రాఘవాపురం గ్రామ సచివాలయం వద్ద, ద్వారకాతిరుమలలోని సెక్షన్ కార్యాలయం వద్ద, అలాగే గుణ్ణంపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం వ్యవసాయశాఖ, విద్యుత్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నటరాజన్ రైతులకు, వినియోగదారులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ భీమడోలు ఏడీఈ గోపాలకృష్ణ, ద్వారకాతిరుమల ఏఈఈ నరసింహస్వామి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.దుర్గారమేష్ తదితరులున్నారు.

లక్కవరంలో అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కి సమాచారం అందించి పరిష్కరించుకోవాలని జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారావు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో విద్యుత్ సంస్థ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగ అవసరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారులు, రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా సర్వీసులు పెట్టుకునే రైతులు, వినియోగదారులు వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఎటువంటి అదనపు ఫీజులు ఉండవన్నారు. లంచాలు, అదనపు వసూళ్లకు పాల్పడితే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.


ద్వారకాతిరుమలలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ నటరాజన్

రైతుల శ్రేయస్సే సంస్థ లక్ష్యంగా..


బాధితుడికి చెక్కును అందజేస్తున్న గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు

కామవరపుకోట: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా గోద్రెజ్ సంస్థ పనిచేస్తుందని సంస్థ డీజీఎం మురళీధర్ అన్నారు. కామవరపుకోట మండలం సాగిపాడు గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలో పనిచేస్తూ, కొన్ని నెలల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై కుడి కాలు కోల్పోయిన బాధితుడు దత్తాడి చందు కుటుంబాన్ని గోద్రెజ్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు గురువారం పరామర్శించి సంస్థ తరఫున రూ.2.50 లక్షల చెక్కును ఆ కుటుంబానికి అందజేశారు. అలాగే చికిత్స సమయంలో వైద్య ఖర్చు నిమిత్తం రూ.1.50 లక్షలు అందజేసినట్టు తెలిపారు. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అలాగే ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ డీజీఎం మురళి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులు, కూలీల కోసం సంస్థ ద్వారా ఉచితంగా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని దీనిని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ విషయాన్ని తమ ఏరియా ప్రతినిధులకు తెలియజేసి ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అన్నారు. తోటలో గెలలు దిగుమతి చేసే క్రమంలో విధిగా కాళ్లకు బూట్లు చేతికి గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలని, ప్రమాదాల నివారణపై తమవంతుగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ ఎంవీ భాస్కరరావు, స్థానిక రైతులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రికి భక్తుల పాదయాత్ర

కొయ్యలగూడెం: భద్రాద్రి పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు గురువారం కొయ్యలగూడేనికి చేరుకున్నారు. కాకినాడ నుంచి వాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 400 మంది భక్తులు పాదయాత్ర చేపట్టారు. ప్రతి సంవత్సరం కాకినాడ పట్టణంతోపాటు పరిసర ప్రాంత భక్తులు ఈ యాత్రను నిర్వహిస్తుంటారు. 2012 సంవత్సరంలో ఇద్దరితో ప్రారంభమైన పాదయాత్ర ప్రస్తుతం 13వ సారి జరగుతుందని గురుస్వామి పేర్కొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: కాకినాడ నుంచి భద్రాచలం రామయ్య క్షేత్రానికి శ్రీవాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన భక్తుల పాదయాత్ర గురువారం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రానికి చేరుకుంది. ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో పాదయాత్ర భక్త బృందానికి స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. వాసుదేవ గురుస్వామికి ఈవో కొండలరావు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.


జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది క్షేత్రానికి చేరుకున్న పాదయాత్రగా భద్రాద్రి వెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: కాకినాడ నుంచి భద్రాద్రికి బయలుదేరిన శ్రీరామ రథోత్సవ పాదయాత్ర బృందం గురువారం రాత్రి జంగారెడ్డిగూడెం చేరుకుంది. పాదయాత్ర బృందానికి గుడిమెట్ల రావు, వీసం శ్రీనివాస్,బూరుగుపల్లి రవీంద్ర తదితరుల వసతి సౌకర్యాలు కల్పించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రహదారి కూడళ్లను దాటే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్ బాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం



టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద జగన్నాథుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, రథంపై కొలువైన స్వామి, అమ్మవార్లు

టి.నరసాపురం: టి.నరసాపురంలో జగన్నాథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం వడలి గ్రామానికి చెందిన జగన్నాథస్వామిని టి.నరసాపురం అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం వద్ద బలరామ కృష్ణుడు (జగన్నాధుడు), సుభద్రాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని రథంపై గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు, ఉత్సవ కమిటీ నాయకులు పసుమర్తి రాము, పర్వతనేని మురళి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ పూజారులు వినయ్ శర్మతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్

కుక్కునూరు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, అలాంటి నాయకుడిని వదిలి తాను పార్టీ మారి వెళ్లే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్త సోమయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను బీజేపీలో చేరినట్టు ఆ పార్టీ నాయకులు ఇచ్చిన పత్రికా ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. బీజేపీ మండల అధ్యక్షుడు తూము వెంకటేశ్వరరావుతో తనకు స్నేహం ఉందని, తనతో పనుందని రమ్మంటే వెళ్లానని, కానీ అక్కడ తన ఫొటో తీసి పార్టీ మారినట్టు ప్రకటన ఇవ్వడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉన్నంతవరకు తాను ఆ పార్టీలోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.

ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవ్ దోహదం


అతిథులకు మొమెంటోలు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విద్యార్థుల్లో ప్రజ్ఞాపాటవాలను వెలికితీసేందుకు బాలోత్సవ్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ లక్ష్మి సరోజారెడ్డి తెలిపారు. స్థానిక ప్రతిభ స్కూల్లో గురువారం బాలోత్సవ్-2024 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్డీవో కె.అద్దయ్య, తహసీల్దార్ స్లీవజోజి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కె.తులసిరెడ్డి, కె.నర్సిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాహ్య ప్రపంచంలో బెరుకు, భయం లేకుండా లేకుండా తన ఆలోచనలు, అభిప్రాయాలు చెప్పగలిగేలా తీర్చిదిద్దడమే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సింధుషా రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా రైతు, కౌలు రైతులకు పంట రుణాలు రూ.2 లక్షల వరకు రద్దు చేయాలని, మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర పిలుపుమేరకు స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కె.అద్దయ్యకు రైతు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘ జిల్లా నాయకులు చిలపరెడ్డి వెంకట రెడ్డి, జమ్మి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసు, ఎస్‌కే బాజీ, చల్లారావు పాల్గొన్నారు.